సాక్షి
వికారాబాద్

గురువారం । 27 । జూన్ । 2024



అప్రమత్తతే జీవాలకు రక్ష

సీజనల్ వ్యాధుల కాలం. పశువులు, మేకలు, గొర్రెలు రోగాల బారిన పడకముందే జాగ్రత్తలు తీసుకోవాలి.

8లో▸



'కర్ర'ంటు కష్టాలు

సర్కారు పనులంటేనే ఆలస్యం.. అందులో కరెంట్ పనులంటే మరింత జాప్యమన్నది నానుడిగా మరింది.

9లో▸



మత్తుకు బానిసలు కావొద్దు

యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కారాదని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు.

9లో▸

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

తాండూరు టౌన్: టీఎస్ ఆర్టీసీ తాండూరు డిపో ఆధ్వర్యంలో నేడు (గురువారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సమత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు ఆర్టీసీ ప్రయాణికులకు కలిగే సమస్యలు, వాటి పరిష్కారాలు, సూచనలు, సలహాలను సెల్ నంబర్ 9959226251కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. తాండూరు పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు టౌన్: నియోజకవర్గ పరిధిలో 18 రేషన్ దుకాణాల డీలర్ల నియామకం కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బషీరాబాద్ మండల పరిధిలో ఒక దుకాణం, పెద్దేముల్ పరిధిలో మూడు, తాండూరు పరిధిలో ఏడు, యాలాల పరిధిలో ఏడు దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. పదో తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి, 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయసు, అదే గ్రామ పంచాయతీ పౌరుడై ఉండాలన్నారు. ఆయా గ్రామాల్లో రేషన్ షాపు ఏ రిజర్వేషన్‌కు కేటాయించారో వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలీసు శాఖ నుంచి గత చరిత్ర ధ్రువీకరణ పత్రం, విద్యార్హత, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో దరఖాస్తు చేయాలన్నారు. జూలై 3వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా నియామకం ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. బషీరాబాద్ మండలంలోని కంసాన్‌పల్లి – బీ (జనరల్ మహిళ), పెద్దేముల్ మండలంలోని గోపాల్‌పూర్ (ఎస్టీ), ఆత్కూర్ (ఎస్సీ), ఖానాపూర్ (ఓపెన్ మహిళ), తాండూరు మండలంలోని మిట్టబాస్పల్లి (బీసీ –డీ మహిళ), రాంపూర్ (బీసీ –ఈ మహిళ), సంగెంకలాన్ (బీసీ – ఏ), తాండూరు (4116031 –జనరల్), తాండూరు (4116034, ఎస్సీ – మహిళ), తాండూరు (4116035, జనరల్ మహిళ), తాండూరు (4116036, బీసీ (బీ), యాలాల మండలంలోని ముకుందాపూర్ (ఎస్టీ), కోకట్ (జనరల్), రాఘవాపూర్ (ఎస్సీ), బానాపూర్ (ఓపెన్), పగిడ్యాల్ (బీసీ –ఏ), బాగాయిపల్లి (జనరల్ – మహిళ), కోకట్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ (ఓపెన్ – వినికిడి లోపం గల వారికి) రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అనంతగిరి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని బాల, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కే హనుమంతరావు, డీపీఆర్ఓ చెన్నమ్మ, మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రుణాల వసూలులో బెస్ట్

మోమిన్‌పేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి అవార్డు



సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న సత్తయ్య

మోమిన్‌పేట: రుణాల వసూలులో జిల్లాలోనే మోమిన్‌పేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బెస్ట్ అవార్డు అందుకుంది. బుధవారం జిల్లా కేంద్ర బ్యాంకులో సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈఓ శేఖర్‌కు డీసీసీబీ చైర్మన్ సత్తయ్య అవార్డు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సొసైటీ అభివృద్ధిపై పాలక మండళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మోమిన్‌పేట సంఘంలో రూ.3.37 కోట్ల దీర్ఘకాలిక రుణాలు వసూలు చేయాల్సి ఉండగా రూ.2.11 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్లు అంకితభావంతో పని చేయాలన్నారు. రైతులకు మెరుగైన సేవలందించడంలో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, మేనేజర్ రియాజ్, సీఈఓ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల సందడి

నేటి నుంచి ఎల్ఎఫ్ఎల్, ఎస్జీటీలకు ప్రమోషన్లు



- ముగిసిన వెబ్ ఆప్షన్లు
- జిల్లాలో 649 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్
- మరో 72 మందికి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా పదోన్నతి
- వెబ్ ఆప్షన్‌కు తక్కువ సమయం ఇవ్వడంపై ఆందోళన

వికారాబాద్: పాఠశాలల్లో పదోన్నతుల కోలాహలం నెలకొంది. వారం క్రితమే ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల (జీహెచ్ఎం) పదోన్నతుల ప్రక్రియ పూర్తి కాగా నేటి నుంచి ఎస్జీటీల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కానుంది. వారం రోజులుగా విద్యాశాఖ అధికారులు ప్రమోషన్ల కోసం వెబ్ ఆప్షన్ చేపట్టగా మంగళవారంతో ఈ ప్రక్రియ ముగిసింది. ముందుగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల ఎల్ఎఫ్ఎల్ (లో ఫీమేల్ లిట్రసీ) హెచ్ఎంలకు వెబ్ ఆప్షన్ల కోసం అవకాశం కల్పించారు. అనంతరం ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను గుర్తించిన అధికారులు ఖాళీలు ప్రకటించారు. అనంతరం ఎస్జీటీల సీనియారిటీ ఆధారంగా పదోన్నతి పొందేందుకు అర్హుల జాబితా తయారు చేసి వారికి వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. ఇందు కోసం తక్కువ సమయం ఇవ్వడంపై టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం నుంచే ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు హోదా పొందే ప్రక్రియ ప్రారంభం కానుంది.

భారీగా పెరగనున్న ఖాళీలు

ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్ఎంలు పదోన్నతి పొందడంతో ఉన్నత పాఠశాలలు జీహెచ్ఎంలతో కలకలలాడుతన్నాయి. ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే ప్రక్రియ కూడా ప్రారంభమైన నేపథ్యంతో వారం రోజుల్లో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత కూడా తీరనుంది. దీంతో మరో వారం రోజుల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు పూర్తిస్థాయి స్టాప్‌తో నిండనున్నాయి. అయితే ఈ పదోన్నతుల ప్రభావం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలపై పడనుంది. చాలా వరకు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే సింగిల్ టీచర్లతో నెట్టుకొస్తున్న ప్రాథమిక పాఠశాలు మూత పడే అవకాశం ఉంది. డీఎస్సీ నిర్వహించే వరకు ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీలు అలాగే ఉండనున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 649 మంది ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, ఎల్ఎఫ్ఎల్ పదోన్నతి పొందుతున్నారు. ఇందులో అత్యధికంగా తెలుగు గ్రేడ్ టు పండిట్లు 159 మంది, హిందీ గ్రేడ్ టు పండిట్లు 149 మంది ఉన్నారు. ఖాళీల స్థానాల్లో వలంటీర్లను నియమించకపోతే ప్రాథమిక విద్య మరింత భారం కాక తప్పదు.

సబ్జెక్టుల వారీగా ఖాళీలు

సబ్జెక్టు	స్థానిక సంస్థలు	ప్రభుత్వ స్కూళ్లు	మొత్తం
పీఎస్ హెచ్ఎం	72	–	72
ఎస్ఏ గణితం	26	–	26
ఉర్దూ మీడియం	04	02	06
ఫిజికల్ సైన్స్	07	01	08
ఉర్దూ మీడియం	03	02	05
బయోసైన్స్	42	00	42
ఉర్దూ మీడియం	01	01	02
సోషల్, సైన్స్	50	01	51
ఉర్దూ మీడియం	03	01	04
తెలుగు	159	04	163
హిందీ	148	05	153
ఇంగ్లిష్	40	02	42
ఉర్దూ	06	02	08
ఫిజికల్ ఎడ్యుకేషన్	49	03	52
స్పెషల్ ఎడ్యుకేషన్	14	01	15



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

పరిహారం.. ప్రభుత్వ ఉద్యోగం

భూములు ఇచ్చే రైతులకు సర్కారు భరోసా

- ఎకరాకు రూ.10 లక్షలు, అర్హత ఉంటే ఉద్యోగ అవకాశం
- తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి
- అప్పాయిపల్లి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ

కొడంగల్: అభివృద్ధి పనులకు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అధికారులు తెలిపారు. కొడంగల్ మండలం అప్పాయిపల్లి సర్వే నంబర్ 19లో భూములు ఉన్న రైతులతో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసేకరణ అధికారి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడారు. అప్పాయిపల్లిలో మెడికల్ కళాశాల, వెటర్నరీ శాఖ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. భూమి పోతున్న తమకు మరో చోట భూమి కేటాయిస్తే పునరావాసం లభిస్తుందని రైతులు తెలిపారు. అభివృద్ధి జరిగే చోట అడ్డంకులు ఉండకూడదని, అధికారులు సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు. పరిహారం, ఉద్యోగం విషయంలో తమకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. సగం మంది రైతులు భూములు ఇవ్వడానికి అంగీకార పత్రాలు రాసిచ్చారని తెలిపారు. అప్పాయిపల్లి సర్వే నంబర్ 19లో ఉన్న భూమి ప్రభుత్వానిదన్నారు. గతంలో పేదలకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వ అవసరాల కోసం తిరిగి తీసుకుంటున్నట్లు వివరించారు. అయితే ప్రభుత్వానికి చెందిన అసైన్‌మెంట్ భూమికి కూడా ధర చెల్లిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఎకరాకు రూ.10లక్షలు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. భూమి ఇచ్చిన రైతు ఇంట్లో అర్హులు ఉంటే ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. సర్వే నంబర్ 19లో ఉన్న భూమిలో సాంకేతిక సమస్యలు ఉన్నట్లు వివరించారు. రికార్డులో పేరు లేని వారు సైతం పొజిషన్‌లో ఉన్నారని అన్నారు. పొజిషన్‌లో ఉన్న వారికి పట్టదారు పుస్తకాల్లో ఉన్న భూ కొలతల్లో తేడా ఉందన్నారు. కొంత మందికి రెండు ఎకరాల రికార్డు ఉంటే కబ్జాకు నాలుగు ఎకరాలు ఉందన్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కారం కావాలంటే రైతులు స్పందించి అంగీకార పత్రాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యువజన నాయకుడు బాల్‌రాజ్, అప్పాయిపల్లి రైతులు పాల్గొన్నారు.



స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

పార్కును కాపాడుకుంటాం

- కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పరిధిలోని 33వ వార్డు బీటీఎస్ కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడుకుంటామని కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కాలనీ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1971 సంవత్సరం నుంచి బీటీఎస్ కాలనీలో ఇంద్రారెడ్డి పార్క్ ఉందని తెలిపారు. గతంలో కొంత మంది పార్కును సొంతం చేసుకోవడానికి ప్రయత్నించారని, కోర్టు కాలనీ వాసులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. ప్రత్యర్థులు మళ్లీ హైకోర్టులో కేసు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కు స్థలానికి సంబంధించి గత మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం కూడా చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం వల్లే నేడు నోటీసులు వచ్చాయని ఆరోపించారు. పార్కును వదిలే ప్రసక్తే లేదన్నారు. అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. పార్కు కబ్జాకు గురికాకుండా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కోరారు. కార్యక్రమం కాలనీ పెద్దలు అశోక్ చారీ, వహీద్, కమల్‌రెడ్డి, కృష్ణ, బుచ్చిరెడ్డి, విద్యాకర్ గౌడ్, ప్రభాకర్, రవికుమార్, సుభాన్‌రెడ్డి, అనిల్, చంద్రకాంత్ రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు

రైతులకు అండగా సహకార సంఘాలు

తుర్కయంజాల్: సహకార సంఘాలు రైతులకు అండగా పనిచేస్తున్నాయని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ది హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభను బుధవారం తుర్కయంజాల్‌లోని తులిప్స్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అన్నారు. రూ.2 లక్షల పంట రుణాలను ఒకే విడతలో మాఫీ చేయాలని నిర్ణయించడం హర్షించదగిన విషయమని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు రవీందర్‌గౌడ్, అంజిరెడ్డి, చంద్రశేఖర్, సతీష్, ప్రవీణ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రామ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, సైదా, రాణి, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పాలన మరింత చేరువ చేస్తాం

- రాష్ట్రంలోనే తలమానికంగా జెడ్పీ భవన నిర్మాణం
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్



జెడ్పీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్: ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్‌లో జెడ్పీ నూతన భవనాన్ని చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్‌ను, సీఈఓ సుధీర్‌ను వారి చాంబర్లలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెడ్పీ నూతన భవనం అందుబాటులోకి రావటం శుభ పరిణామం అన్నారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చొరవతో మూడున్నర ఎకరాల్లో రూ.5 కోట్ల వ్యయంతో ఈ భవనం మొదటి దశ పూర్తి చేశారని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ట్రాన్స్ జెండర్ల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. వారికి మహిళా సంఘాల తరహాలో రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. జిల్లాలో వెనుకబడిన, మారుమూల ప్రాంతాల అభివృద్ధి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొదటి జెడ్పీ భవనం వికారాబాద్‌లో అందుబాటులోకి వచ్చిందని, ఇది చాలా సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ చొరవతో మరో రూ.3 కోట్లు వెచ్చించి మిగతా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి సహకరించిన జిల్లా యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధీర్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల పాల్గొన్నారు.

కాలె వర్సెస్ పట్నం



ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మధ్య వాగ్వాదం

- స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే యాదయ్య
- ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కల్పించుకోవడంతో వివాదం

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలెయాదయ్య మధ్యమాటల యుద్ధం చోటుచేసుకుంది. బుధవారం నిర్వహించిన వికారాబాద్ జిల్లా పరిషత్ కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. జెడ్పీ కార్యాలయ భవనానికి గత ప్రభుత్వం కాగితాల మీద మంజూరు ఇచ్చింది తప్ప.. నిధులు ఇవ్వలేదన్నారు. జెడ్పీ నిధులతో భవనాన్ని కొంత మేర పూర్తి చేశామని, సీఎంతో మాట్లాడి త్వరలోనే మరిన్ని నిధులు తీసుకువచ్చి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం మైక్ అందుకున్న ఎమ్మెల్యే యాదయ్య మంజూరు ఇచ్చిన కాగితాలు ఎక్కడున్నాయో చూపించాలన్నారు. ఇంతలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కలగజేసుకుని ఏం మాట్లాడుతున్నావ్.. అవన్నీ ఇక్కడ మాట్లాడొద్దన్నారు. దీనిపై యాదయ్య స్పందిస్తూ.. ఎందుకు మాట్లాడొద్దు.. మాకు మాట్లాడే అధికారం లేదా..? అని ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా జెడ్పీ నుంచి నిధులు మీరే మంజూరు చేస్తారు.. కాంట్రాక్టు మీరే చేస్తారు.. అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్పీకర్ మాట్లాడిన తర్వాత మళ్లీ ఎలా మాట్లాడుతావని పట్నం ప్రశ్నించగా.. నేను స్పీకర్ అనుమతి తీసుకునే మాట్లాడుతున్నానని యాదయ్య బదులిచ్చారు. స్పీకర్ సర్ది చెప్పటంతో వివాదం సద్దు మణిగింది.

రక్తహీనతను సమూలంగా తీసేద్దాం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: పిల్లల్లో రక్తహీనత సమస్యను సమూలంగా తీసేద్దామని, ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికీ ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేద్దామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా ఆరోగ్య శాఖ అధికారి, డీఈఓ, సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 75 శాతం మంది పిల్లలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. 1,062 పాఠశాలల్లో 11 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఉన్నారని వారందరికీ ప్రతి గురువారం ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను సమన్వయం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. 5 నుంచి 11 సంవత్సరాల లోపు పిల్లలకు 45 ఎంజీ మాత్రలు, 11 నుంచి 19 వయస్సు వారికి 60 ఎంజీ ట్యాబ్లెట్లు ఇవ్వాలన్నారు. ఇందుకు సంబంధించి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వన్‌కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకాదేవి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లేశం, డీవైఎస్ఓ హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమాఖ్య భవనం అప్పగించం



ఆందోళన వ్యక్తంచేస్తున్న మహిళలు

దౌల్తాబాద్: తమకు అప్పగించిన మహిళా సమాఖ్య భవనాన్ని ఇతర శాఖలకు అప్పగించమని మండల కేంద్రంలోని కార్యాలయం ఎదుట మహిళా సంఘాల సభ్యులు బుధవారం ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం కలెక్టర్ మండలంలో పర్యటించారు. స్థానికంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని అంగన్‌వాడీ నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. సమాఖ్య భవనాన్ని అంగన్‌వాడీకి అప్పగించాలని సూచించారు. దీంతో మహిళలు ఆందోళన బాటపట్టారు. అనంతరం ఎంపీఓ రవీందర్ సభ్యులను సముదాయించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తానని హామీఇచ్చారు. మండలంలో ఎక్కడ కూడా గ్రామ సంఘాలకు సొంత భవనాలు లేవని, ఉన్న భవనాలను ఇతర శాఖలకు అప్పగిస్తే తాము సమావేశాలు, ఇతర కార్యక్రమాలు ఎక్కడ నిర్వహించుకోవాలని సభ్యులు ప్రశ్నించారు.

రెండు కార్లు ఢీ..
నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో కార్లు

మొయినాబాద్: ఎదురెదురుగా వస్తున్న రెండు కా ర్లు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యా యి. ఈసంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మండల పరిధి చిన్నషాపూర్ చౌరస్తా సమీపంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా నర్సాపూర్‌కు చెందిన అరవింద్‌రెడ్డి, వినయ్ తన స్విఫ్ట్ కారులో బుధవారం సాయంత్రం చేవెళ్ల వైపు వెళ్తున్నారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ మండలం చిన్నషాపూర్ చౌరస్తా సమీపంలోకి రాగానే.. వికారాబాద్‌కు చెందిన అర్షద్, ముషారఫ్ తమ స్విఫ్ట్ డిజైర్ కారులో వేగంగా వస్తూ.. మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వచ్చి స్విఫ్ట్ కారును ఢీకొట్టారు. ఈ సంఘటనలో కార్లలో ఉన్న నలుగురు గాయపడ్డారు. అర్షద్, ముషారఫ్‌కు కాళ్లు, తలకు, అరవింద్‌రెడ్డికి కడుపుపై, వినయ్‌కి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఘటన అనంతరం జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కార్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

పంటలను కాపాడుకోండి
జిల్లా వ్యవసాయ అధికారి గీతా



పత్తి మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి గీతా

కొందుర్గు: ప్రస్తు తం వర్షాలు అను కూలంగా లేకపోవడం వలన మొ లక దశలోనే పంటలు ఎండిపోతున్నాయని, వర్షాభావ పరిస్థితుల నుంచి పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతా సూచించారు. బుధవారం ఆమె కొందుర్గు మండం టేకులపల్లి గ్రామాన్ని సందర్శించి పత్తి, మొక్కజొన్న, జనుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. పంటలు మొలక దశలో ఎండిపోకుండా ఉండేందుకు నీటిని పిచికారీ చేయాలని, అదే విధంగా లీటరు నీటికి రెండు గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ముఖ్యంగా పత్తి పంటలో మొలక లేని చోట విత్తనాలు నాటుకోవాలని చెప్పా రు. మొక్కజొన్నలో కత్తెర పురుగు రాకుండా నియంత్రించేదుకు పంట మధ్యలో ఎకరానికి ఆరు పంగళ కర్రలను పాతాలని పేర్కొన్నారు. వీలైనంత వరకు పంట మార్పిడి పాటించాలన్నారు. వరిలో పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుములు చల్లి ఏపుగా పెరిగిన అనంతరం కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీకాంత్, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తతే మూగ జీవాలకు రక్ష

- సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరి
- నివారణకు ముందస్తు చర్యలు

కొడంగల్ రూరల్: సీజనల్ వ్యాధుల కాలం. పశు సంపద, మేకలు, గొర్రెలు రోగాల బారిన పడక ముందే.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వానాకాలంలో వాటికి గొంతువాపు, జబ్బవాపు, చిటికె రోగం, గాలికుంటు సక్రమించే ప్రమాదం ఉంది. వాటి నివారణ వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి' అని పోషకులకు పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు వ్యాధులు, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు..

జబ్బవాపు..

జబ్బవాపు వ్యాధిని బ్లాక్ క్వార్టర్, బ్లాక్ లెగ్ అని అంటారు. ఇది తెల్లజాతి పశువులకు ఎక్కువగా సంక్రమిస్తుంది. క్లాస్ట్రీడియం చౌవోయి బ్యాక్టీరియా వలన ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. మూగజీవాలు కలుషిత నీరు తాగడంతో వ్యాధి సోకేందుకు అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. తీవ్రమైన జ్వరం ఉండి మేత మేయక పోవడం, కుంటడం, ఆకస్మికంగా పశువుల తొడలు, జబ్బ భాగాల్లో వాపు రావడం, కండరాల ప్రాంతంలో బ్యాక్టీరియా విష పదార్థాన్ని విడుదల చేయడం ద్వారా ఆ ప్రాంతంలో చర్మం కుళ్లిపోతుంది. కొన్ని దూడల్లో ఈ లక్షణాలు కనిపించకుండానే కిందపడి కొట్టుకుంటాయి. గంటల వ్యవధిలోనే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ప్రమాదం పసిగట్టినే వెంటనే పశు వైద్యులను సంప్రదించాలి.

చిటికె రోగం..

పల్స్ కిడ్నీ డీసీస్ అని కూడా అంటారు. అధికంగా మేత మేయడం వలన ఈ వ్యాధి సోకుతుంది. క్లాస్ట్రిడియం పర్‌ఫ్రంజెన్స్ బ్యాక్టీరియా టైప్ సీ, డీ అనే స్ట్రెయిన్స్ వలన గొర్రెలు, మేకలకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. మట్టి కలిసిన గడ్డిని తినడం, వర్షాలు కురిసిన సమయంలో అధిక మోతాదులో మేయడం వలన నట్టలు ఎక్కువగా తయారవుతాయి. దీంతో బ్యాక్టీరియా అధికంగా వృద్ధి చెంది ఎప్సీలాన్ ట్యాక్సీన్‌ని పొట్టలో విడుదల చేయడంతో విరేచనాలు అవుతాయి. ఇవి ట్యాక్సిన్ బ్రెయిన్‌కు చేరి ఫిట్స్ వస్తుంది. వ్యాధి సోకిన జీవాల్లో విరేచనాలు, కడుపు ఉబ్బడం, వణుకు, పళ్లు కొరకడం, జ్వరం, ఫిట్స్ వచ్చినట్లు కొట్టుకోవడం చేస్తాయి. వ్యాధి సోకిన జీవాలకు ఆంపిసిల్లిన్, క్లోరాంఫినికాల్ మందులు వేయాలి. రిహైడ్రోషన్ సొల్యూషన్, సపోర్టివ్ థెరపీ అందించాలి. ముందస్తు టీకాలు వేయించాలి.

గాలికుంటు వ్యాధి..

ఆవులు, బర్రెలు, తెల్లజాతి పశువుల్లో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. రోగం బారిన పడిన పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందని, అధిక జ్వరం, కాలికి పుండ్లు, నోట్లో చిగుర్లలో బొబ్బలు కనిపిస్తాయి. నోటి పుండ్లకు బోరోగ్లిసరిన్ పేస్ట్ రాయాలి. కాలి పుండ్లకు పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రంగా కడిగి ఆంటిసెప్టిక్ ఆయింట్‌మెంట్ పూయాలి.

గొంతువాపు

పశువుల్లో ప్రధానంగా గేదెలకు గొంతువాపు వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువు చొంగ కార్చడంతో తాగునీరు, గడ్డి కలుషితమై ఇతర పశువులకు వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి పడిన పశువులకు అధిక జ్వరం , చొంగ కారడం, గొంతు, మెడ, ముందరి కాళ్ల మధ్యలో నీరు చేరడం, కంటి నుంచి నీరు కారడం, ఊపిరి తిత్తులకు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. పశు వైద్యాధికారుల సూచనల మేరకు ముందస్తుగా వ్యాక్సినేషన్ ఇప్పించాలి. తద్వారా రోగం వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టవచ్చు.



పశు వైద్య శిబిరంలో జీవాలకు టీకా ఇస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి



మూగజీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పశుపోశకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లంపీస్కిన్ వ్యాధి సోకకుండా ముందుగా వేసే టీకాలను పశువులకు ఇప్పించాలి. రోగాలు సోకకుండా, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రభుత్వం, వైద్యాధికారులు గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలి.

– పరమేష్, పశువైద్యాధికారి, రావులపల్లి

వైద్యం అందక.. మృత్యువాత

దుద్యాల్: అసలే రోగాల కాలం. పశువులకు, జీవాలను అనేక రకాల వ్యాధులు చుట్టుముడుతుంటాయి . ఈ క్రమంలో స్థానికంగా పశువైద్యశాల లేకపోవడం, సకాలంలో వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని మండల పరిధి గౌరారం రైతులు, కాపరులు ఆవేదన చెందుతున్నారు. పుశువులకు ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే 10 కిలో మీటర్ల దూరం ఉన్న దుద్యాల మండల కేంద్రానికి తీసుకెళ్లాల్సి వస్తుందని యజమానులు తెలిపారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పశు వైద్యుడు బదిలీ అయ్యారని, ఇకనాటి నుంచి వైద్యశాల మూత పడిందని వెల్లడించారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గ్రామంలో వైద్య సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.



గౌరారంలో మూతపడిన పశువైద్యశాల

మేకలను ఎత్తుకెళ్లిన దొంగలు

ధారూరు: గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు జీవాలను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి ధారూరు మండలం మైలారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డప్పు రాములు ఎప్పటిలాగే తన మేకలను రేకుల షెడ్డులో తోలి సమీపాన ఉన్న ఇంట్లో నిద్రించారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో అలికిడి కావడంతో జీవాల మందను పరిశీలించగా.. అందులో నాలుగు మేకలు లేవని గుర్తించారు. వెంటనే పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో.. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. అపహరణకు గురైన మేకల విలువ రూ.30 వేలు ఉంటుందని బాధితుడు రాములు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

అనంతగిరి: బాలికకు మాయ మాటలు చెప్పి మోసం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదయింది. సీఐ నాగరాజు తెలిపిన వివరాలిలా ప్రకారం.. వికారాబాద్ ప్రాంతానికి చెందిన బాలిక(14) పాఠశాలకు వెళ్లడానికి నిరీక్షిస్తుండగా, మోమిన్‌పేట మండలానికి చెందిన యాదుల్లా అనే యువకుడు బాలికకు మాయ మాటలు చెప్పి ఈ నెల 24న తీసుకెళ్లాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఉన్న బాలికను గుర్తించి, ఈ నెల 25న కుటుంబీకులకు అప్పగించారు. ఈ క్రమంలో నిందితుడు పోలీసుల రాకను పసిగట్టి పారిపోయాడు. త్వరలో యువకున్ని పట్టుకుంటామని సీఐ తెలిపారు.

మత్తు నేర ప్రవృత్తికి బాటలు





ర్యాలీలో పాల్గొన్న ఏఎస్పీ రవీందర్ రెడ్డి, సిబ్బంది (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఏఎస్పీ

- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి..
- డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయండి
- అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి

అనంతగిరి: యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటుందని, ఆ మత్తు నేర ప్రవృత్తికి దారితీస్తుందన్న విషయం గ్రహించాలని ఎస్పీ రవీందర్ రెడ్డి సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా బుధవారం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి నుంచి ఎమ్మార్పీ పెట్రోల్ పంప్ వరకు మాదకద్రవ్యాలు నిరోధం(సే నో టు డ్రగ్స్) అనే అంశంపై విద్యార్థులుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఏ ఎస్పీ ప్రారంభించారు. మాదక ద్రవ్యాలతో జరిగే నష్టాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ.. మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సమాచారం ఇవ్వండి..

యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు చీకటి మయం కావటమే కాకుండా.. కుటుంబం అబాసుపాలు అవుతుందని, బంధువులు, స్నేహితులు దూరమవుతారని ఏఎస్పీ హెచ్చరించారు. వ్యసనాలకు బానిస కాకుండా.. ఉన్నత చదువులు చదివి, కన్నవారికి, ఉన్న ఊరికి పేరుప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. ఎవరికైనా నిషేధిత మాదక ద్రవ్యాల క్రయవిక్రయాల గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెకర్ వెంకటేశం, వికారాబాద్ సీఐ నాగరాజు, ధరూర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొనారు.

ఇంటికి వెళ్తానని చెప్పి.. బాలుడు అదృశ్యం



సిద్ధార్థ (ఫైల్)

కుల్కచర్ల: ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లిన బాలుడు అదృశ్యమైన సంఘటన కుల్కచర్ల మండలంలో చొటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్యామలమ్మ కూమారుడు సిద్దార్థ.. చిన్నమ్మ పద్మమ్మ అంతారం గ్రామంలో ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి బడికి వెళ్లను అని మారం చేస్తుండటంతో.. చదవకుంటే మీ ఊరికి వెళ్లు అని చిన్నమ్మ చెప్పడంతో మంగళవారం అక్కడి నుంచి స్వగ్రామం బొంరెడ్డిపల్లికి బయలుదేరిన బాలుడు ఇంటికి తిరిగిరాలేదు. పద్మమ్మ తన సోదరి శ్యామలమ్మకు విషయం చెప్పగా.. కుమారుడు వస్తాడని భావించిన ఆమె బాలుడు ఎంతకూ రాకపోవడంతో తెలిసిన వారి దగ్గర వెతకగా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బుధవారం కుల్కచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

తలకొండపల్లి: పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధి యడవల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం .. యడవల్లికి చెందిన కమలమ్మ(57) స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తుంది. మంగళవారం పశువుల మేతకోసం వ్యవసాయ పొలంలో చొప్ప గడ్డి కత్తరిస్తుంది. ఈ క్రమంలో కమలమ్మను పాము కాటువేసింది. చికిత్స కోసం ఆమనగల్లు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమె చనిపోయింది.

జాతీయ రాహదారిపై లారీ బోల్తా

ఇబ్రహీంపట్నం: కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ కూడా క్షేమంగానే ఉన్నాడు. ఘటనా స్థలం సాగర్ హైవే కావడంతో ట్రాఫిక్‌కు సుమారు గంటపాటు అంతరాయం కలిగింది. పోలీసులు లారీని పక్కకు తొలగించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

మట్టి తవ్వకాలకు బ్రేక్!



మట్టితోడుతున్న వ్యవసాయ పొలం ఇదే

- విచారణకు రాని అధికార యంత్రాంగం
- అధికారుల తీరుపై అసహనం

తాండూరు రూరల్: మండల పరిధి రాంపూర్ గ్రామ సమీపంలో మట్టి(మొరం) తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొంత కాలంగా మట్టిని తోడుతూ.. జాతీయ రహదారి పనులకు తరలిస్తున్న వైనం.. మంగళవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాంపూర్ సమీపంలోని సర్వే నంబర్ 9లో సుమారు ఎకర పొలంలో యంత్రాల సహాయంతో నిత్యం వందల కొద్ది టిప్పర్లలో మొరంను తరలిస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్‌ను కరన్‌కోట్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇంత పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నా స్థానిక రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. అక్రమార్కులతో అధికారులు చేతులు కలిపారని పలువురు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఊరికి సమీపాన మట్టిని తోడటం వలన పెద్దగా గుంతలు ఏర్పడ్డాయని, తద్వారా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయిని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. ఆటలు ఆడుకునేందుకు పిల్లలు, యువకులతో పాటు.. మేత మేస్తూ పశువులు కూడా అటుగా వెళ్తుంటాయని వెల్లడించారు. సంబంధిత అధికారులకు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చట్టవిరుద్ధం..



పర్మిషన్ లేకుండా వ్యవసాయ పొలంలో మట్టి తొవ్వుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. సాగు భూమిలో మట్టి తవ్వకం చట్టవిరుద్ధం. వ్యవసాయేతర భూమిగా చేసుకొని, ఆ తర్వాత మైనింగ్‌ను నుంచి అనుమతి తీసుకోవాలని. రాయల్టీ కట్టి మట్టి తవ్వకాలు చేపట్టాల్సి ఉంటుంది. మైనింగ్ అధికారులకు రెవెన్యూ అధికారులు రాసిన లేఖ ఆధారంగా ఎలా మట్టి తవ్వకాలు జరుపుతారు. గురువారం మైనింగ్ అధికారులతో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తాం. పొలం యజమానిపై కేసు నమోదు చేసి, జరిమానా విధిస్తాం.

– తారాసింగ్, తహసీల్దార్, తాండూరు మండలం

తండ్రి మందలించాడని..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆనంద్



నీటి సీసాలో పురుగు మందు కలుపుకొని.. తాగుతున్న యువకుడు

- తనయుడు ఆత్మహత్యాయత్నం
- వాట్సప్‌లో వీడియో చక్కర్లు.. కాపాడిన పోలీసులు

చేవెళ్ల: అందరి ముందు తండ్రి మందలించాడన్న మనస్తాపంతో కొడుకు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గిరిగెట్ పల్లి గ్రామానికి చెందిన విఠలయ్య కుమారుడు ఆనంద్(21) చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ.. మల్కాపూర్ గ్రామంలోని తన అక్క శశికళ ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో తండ్రి విఠలయ్య.. కొడుకు ఆనంద్ కోసం నాలుగు రోజులుగా ఫోను చేస్తున్నా తీయకపోవడంతో విషయం తెలసుకునేందుకు మంగళవారం చేవెళ్లకు వచ్చాడు. పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి చూడగా.. అక్కడే ఉన్న ఆనంద్‌ను చూసి కోపంతో మందలించాడు.

వీడియో ఆధారంగా..

తండ్రి కోపగించడాన్ని అవమానంగా భావించిన తనయుడు పురుగు మందు(టప్పర్ 77)ను తాగుతున్న వీడియోలను వాట్సప్ స్టేటస్‌లో పోస్టు చేశాడు. ఈ దృశ్యాలను గమనించిన ఆనంద్ బావ జంగయ్య వెంటనే భార్య శశికళతో చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీడియో ఆధారంగా ఆనంద్ ఉన్న లోకేషన్ కొనగట్టు శివాలయం ప్రాంతంలో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడే ఉన్న యువకున్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మహేందర్‌రెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. తాగిన మందును పూర్తిగా బయటకు తీయడంతో ప్రమాదం తప్పిందని వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించటమే కాకుండా.. ఘటనా స్థలికి వెళ్లి యువకుడి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ నరేశ్, హోంగార్డు రమేశ్‌ను అధికారులు, స్థానికులు అభినందించారు. వాట్సప్ వేదికగా.. శభాష్ పోలీస్ అంటూ ప్రశంసించారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

ఇబ్రహీంపట్నం: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను మంగల్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కొండ మల్లేపల్లి నుంచి కొంగరకలాన్‌కు ఎలాంటి అనుమతి లేకుండా నాలుగు టిప్పర్లలో మట్టిని తరలిస్తుండగా.. వాటిని పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. ఈ మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. అక్రమంగా మట్టిని తరలిస్తే.. వాహనం సీజ్ చేయడంతో పాటు.. సంబంధిత వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జెడ్పీ చైర్ పర్సన్ సునితారెడ్డి

బంట్వారం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునితారెడ్డి అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని చర్చి ప్రాంగణంలో జెడ్పీ నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఐదేళ్ల తన పదవీ కాలంలో రూ.కోట్లతో కోట్‌పల్లి మండలాన్ని అభివృద్ధి చేశానన్నారు. జిల్లాలోనే కోట్‌పల్లి మండలానికి అత్యధిక నిధులు కేటాయించి సీసీ రోడ్లు, పాఠశాలలకు ప్రహరీలు, అంగన్‌వాడీ భవనాలు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. కొత్తగా ఏర్పడిన కోట్‌పల్లి మండలంలో నూతనంగా మండల పరిషత్ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ కమిటీలతో రూ.కోట్లతో పాఠశాలల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, విద్యార్థులకు మౌలిక వసతులు సమకూరుస్తున్నామని వివరించారు. కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బంట్వారం, పెద్దేముల్ జెడ్పీటీసీలు సంతోష, దారాసింగ్, తహసీల్దార్ ఆశా జ్యోతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ డానియల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మీ, ఎఎంసీ మాజీ చైర్మన్ శివానందం, సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్, అంజయ్య ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్

పుట్టిన రోజు తెల్లారే.. నిండునూరేళ్లు

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



మల్లేశ్ (ఫైల్)



మల్లేశ్ మృతదేహం

కుల్కచర్ల: పుట్టిన రోజు మరుసటిరోజు ఆ యువకుడికి నిండు నూరేళ్లు నిండాయి. మంగళవారం రాత్రి వేడుకల అనంతరం తెల్లవారు దావత్ చేసుకుందామని సన్నిహితులతో వెళ్లిన యువకుడు.. రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట్ మండలం కిషన్‌గూడ గ్రామానికి చెందిన డ్యాగ మల్లేశ్(24) బుధవారం తెల్లవారు జామున కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గేటు వద్ద బైక్ అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని మృత్యువాత పడ్డాడు.

ప్రాణం తీసిన పుట్టిన వేడుక

తన పుట్టిన రోజు సందర్భంగా మల్లేశ్.. మంగళవారం రాత్రి తన స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపాడు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం పోలెపల్లి గ్రామంలో తన బావ దగ్గరికి స్నేహితులు ఎంబడి శ్రీకాంత్, కుమ్మరి కృష్ణ, యార అనిల్‌తో కలిసి వెళ్లగా.. అక్కడ అతను లేడు. ఈ క్రమంలో తిరుగు ప్రయాణంలో ఇప్పాయిపల్లిలో తాటికల్లు తాగారు. అక్కడి నుంచి మల్లేశ్ వాహనాన్ని మిత్రుడు కృష్ణ రోడ్డుపైకి నడుపుతున్న క్రమంలో బైక్ అదుపుతప్పి వేగంగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మల్లేశ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. 108కి స్నేహితులు సమాచారం ఇవ్వడా.. ఘటనాస్థలానికి చేరుకున్న 108 సిబ్బంది యువకుడు మృతిచెందినట్లుగా అనుమానం వ్యక్తంచేశారు. స్నేహితుల కోరిక మేరకు వైద్య చికిత్సలకు కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. మృతిచెందినట్లుగా వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, 11నెలల పాప ఉంది.